# గిరిదాటని సంస్కారం

వేమకోటి సీతారామశాస్త్రి
కళింకోట ప్రభాకర దేవ్

ఇంకా చీకటి పడలేదు. స్నానంచేసి, సన్నగా యీల వేసుకుంటూ గిరి నిలువెత్తు అద్దంకు ఎదురుగా నిల్చొని తల దువ్వుకుంటున్నాడు. నిలువుటద్దం మీద వెలుగుతున్న బల్బు పాము పడగమీది మణిలా వెలిగిపోతోంది వాచీవేపు చూసుకున్నాడు. ఇంకా ఆరుకాలేదు గిరి తనలో నవ్వుకున్నాడు. లైటువేసినంత మాత్రాన సాయంకాలమై పోతుందా?

తలుపు చప్పుడైనట్లనిపించి వెనక్కు తిరిగాడు. కానీ రెండోసారి చప్పుడు కాలేదు తన భ్రమ. ఆరు దాటితేకాని రానని చెప్పింది, అరుణ. నిముషాలు యుగాలుగా మారటం అంటే ఇదేననుకున్నాడు

'ఎప్పుడూ ఇంతే అరుణతోటి. సినీమా ప్రారంభమయితేగాని హాల్లోకి వెళ్ళి కూర్చోవద్దంటుంది. ఇంకెంతకాలం ఈ దొంగబ్రతుకు' అనుకున్నాడు గిరి

ఏమీ తోచక రూంచుట్టూ చూశాడు ఘోటక బ్రహ్మచర్యాన్ని ప్రతిబింబిస్తున్నది ఆ గది. అస్తవ్యస్తంగా చిమ్మబడ్డ పుస్తకాలు టేబిలుమీద టీ కాచుకునే సామాన్లూ, సగం మడిచీ మడవని దోమ తెర షూటింగు అయిపోయిన తరువాత ఒదిలేసిన సినీమా సెట్టింగులా వుందా రూము.

మళ్లా తలుపు తట్టిన చప్పుడు. అరుణ కోసం ఆదుర్దాగా తలుపుతీస్తే ఎదురుగా చిరునవ్వుతో పాలమనిషి.

"ఏటి బాబూ! తలుపు వేసుకుని ఆలోసిస్తున్నారు?" అంటోంది పాలమనిషి నవ్వుతూ.

గిరి మాట్లాడకుండా పాలు తీసుకున్నాడు. తలుపేసుకుని మళ్లా నిరీక్షణ. నిముషాలు యుగాలుగా వున్నాయతనికి. ఏం తోచక టీపాయ్‌మీదనున్న పత్రిక తీశాడు. గతవారం ప్రచురణ అయిన తన కధమీది అభిప్రాయాలు చదివాడు. చాలా బాగుందని పొగడ్తలే, అన్ని ఉత్తరాల్లోనూ. అసలు ఉత్తరాలు జీవితాల్ని ఎంత చిత్రంగా మలుపు తిప్పుతాయో ఎవరికి తెలుసు? తన కధలమీద ఉత్తరాలు రాసిన అరుణ జ్ఞాపకం వచ్చింది.

*     *     *

"మీ కధలుచదివి నేను ఎప్పట్నుంచో మీ అభిమాన పాఠకురాలినయ్యాను. ముఖ్యంగా మొన్న రాసిన "బలిపశువులు" అన్న కధానికలో కట్నాల సమస్యను చర్చించారు. ఎంతో బాగుంది. మీ ఎడ్రసు తెలుపండి". అని పత్రికల కేరాఫ్ ఎడ్ర

ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే ఇద్దరిదీ ఒకే వూరు. ఏదో ఆఫీసులో టైపిస్టుగా పని చేస్తోందా అమ్మాయి. వెంటనే తన ఎడ్రసు రాసి పంపాడు.

ఆ రోజు ఆదివారం. క్రొత్తగారాసిన కథను మరోసారి చదువుకుని, నిద్ర రాక మంచంమీద అరనిద్రలో వుంటే తలుపు చప్పుడయ్యింది. ఎదురుగా ఒక మెరుపులా మెరుస్తున్న ఒక అపరిచితస్త్రీ. ఆమెతోబాటు ఒక చిన్నమ్మాయి.

"మీరేనా గిరిగారు?" అందామె చేతులు జోడిస్తూ. గిరి ఆమెనుచూసి తొట్రుపాటు పడ్డాడు.

"ఆ నేనే! లోపలికి రండి" ఆహ్వానించాడు.

"నా పేరు అరుణ. ఈ అమ్మాయి మా చెల్లి" అంది.

"చాలా సంతోషం" అన్నాడు గిరి ఏం మాట్లాడాలో తెలియక. ఇద్దరిమధ్యా కాసేపు నిశ్శబ్దం

"మీ కథలు చాలా బావుంటాయి. ప్రతీ విషయాన్నీ రాజీ దృక్పధంతో కాకుండా కూలంకషంగా చర్చిస్తారు" అంది

గిరి సిగ్గుపడ్డాడు పొగడ్తకు.

"అందరూ కధల్ని పొగిడితే విమర్శ చేసి లోపం ఎవరు ఎత్తిచూపిస్తారండీ?" అన్నాడు.

"అయితే సినిమా నటుల్లా అభిమాన సంఘం కాకుండా, దురభిమాన సంఘం ఒకటి మీ పేరున పెట్టమంటారా?"ఇద్దరూ నవ్వుకున్నారు. గిరి లేచాడు టీ పెట్టడానికి.

"మీరేం అతిధిమర్యాదలు చెయ్యొద్దు. కాసేపు మాట్లాడుదామని వచ్చాం" అంది.

"అయినా నా కోసం" అన్నాడు గిరి.



చొరవగా అరుణే టీ పెట్టింది. ముగ్గురూ త్రాగారు. తరువాత కథానికల మీదకు చర్చలు మళ్ళాయి.

"ఇంతగా చదువుకున్నారు. మీరు కూడా కథలు రాయండి" అన్నాడు చనువుగా ఆమెతో.

"ఇంక నా బ్రతుక్కి కథ లొక్కటే తక్కువ" అంది అరుణ నిట్టూరుస్తూ.

అలా వాళ్ళ స్నేహం కథ చిలవలు పలవలు వేసింది. ఒకనాడు నాగావళీనదీ ఒడ్డున ఇసుకలో కూర్చున్నప్పుడు అడిగింది అరుణ.

"సార్! రచయిత కథల్లో వర్ణించే ఆశయాలు సమాజం కోసమేనా? లేక తను ఆచరణలో పెట్టాలని ఆకాంక్షిస్తూ వుంటాడా?" అంది. ఆమె చేతిలో ఇసుక రేణువులు తూర్పుగాలికి వాలుగా ఎగురుతున్నాయి.

"చాలా మంచి ప్రశ్న అడిగావు అరుణా! చాలామంది ఆదర్శాలు వల్లె వేస్తారు. అవి తమ జీవితంలో ఆచరించడానికి సాధ్యంకాదు. కారణం ఏమిటంటే తమచుట్టూ వుండే పరిస్థితులు వాళ్ళని ఆ పని చేయనియ్యవు" అన్నాడు.

"ఏమిటా పరిస్థితులు అలాగయితే మరి నైతిక విలువలు?"

"పరిస్థితులు ఏవైనా నైతిక విలువలు వేరు. ఒక రచయిత ఉన్నాడనుకో. అతను కట్నాలు తీసుకోవటం మహాపాపం అని రాసినా, పాపం అతని వెనుక వుండే కుటుంబ అవసరాలు అతన్ని ఆదర్శానికి బలిపెట్ట నియ్యవు. వాస్తవానికి నైతిక విలువలతో జీవితాన్ని రచనా వ్యాసంగానికి ముడిపెట్టుకున్న రచయితలు నూటికి ఒకరో యిద్దరో వుంటారు" అన్నాడు.

కరుగుతున్న సాయంసంధ్యలో అరుణ చాలా అందంగా కనిపిస్తున్నది. ఫుల్‌వాయిల్ పువ్వులచీర గాలిని కౌగలించుకుని శరీరానికి అతుక్కుపోయి వింత అందాల్ని చిమ్ముతున్నది. బారెడు జడలో తురుముకున్న గులాబీపువ్వు గాలికి అటూ ఇటూ ఊగుతున్నది, ఆమె మనస్సులో ఉండే సందేహంలా.

"అయితే మీ జీవితంలో ఆదర్శాలు గూడా రచనల వరకే పరిమితమా?"

నవ్వాడు గిరి.

"నేను రచనలవరకే పరిమితం చేసుకోలేదు అరుణా. ఒంటరివాణ్ణి ముందూ వెనకా ఎవ్వరూ లేరు ఒకప్పుడు ఎవరయినా వున్నా వాళ్ళందర్నీ ఒదిలి నేను నా కోసరం, నా జీవితంకోసరం ఏమయినా చేయగలను" అన్నాడు దృఢంగా.


"అయితే మీరు వర్ణాంతర వివాహం చేసుకోగలరా?"

"ఏం తప్పా? అయినా ఈ రోజుల్లో ఇంకా వాటి గురించి ఆలోచించడం తెలివితక్కువ" అన్నాడు గిరి.

"అలాగనకండి. మీరు అగ్రవర్ణాలకు చెందినవారు."

"నా కవేం పట్టింపులు లేవు అరుణా. నా వివాహ విషయంలో నేనప్పుడే ఒక నిర్ణయం చేసుకున్నాను. కానీ ఇంకా ఆ అమ్మాయి అంగీకారం అడగలేదు."

అరుణ హతాశురాలైంది. ఆమె ఆశాభంగాన్ని కనిపెట్టి గిరి మళ్ళా ప్రారం




భించాడు.

"ఆ అమ్మాయిని చూస్తావా?" అరుణ ఆశగా తల వూపింది. పర్సులో ఫోటో దాచుకున్నాడేమో ననుకుంది.

"ఈ కళ్ళలోకి చూడు" అడిగాడు దగ్గరగా జరుగుతూ.

అరుణ దగ్గరగా చూసింది కను పాపల్లో తన ప్రతిబింబం కన్పించింది. సిగ్గుపడింది. గాలికి కంట్లో ఇసుకరేణువు పడింది. రెండు చేతుల్తో తలదగ్గరకు తీసుకుని కంట్లో ఉండే ఇసుకరేణువు వూదాడు సిగ్గుతో అరుణిమ దాల్చిన ఆమె బుగ్గల్లో తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు గిరి.

"యూ పిల్లీ" అంది అరుణ బుగ్గలు తుడుచుకుంటూ ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు.

"ఎప్పుడు చేసుకుందాం పెళ్ళి?"

"మీ ఇష్టమే"అంది పిచ్చిగా ఇసుకలో గీతలు గీస్తూ.

"మరి మీ వాళ్ళతో చెప్పావా? మరి వాళ్ళు అంగీకరిస్తారా?"

అరుణ గుండెల్లో రాయి పడింది. ఆమె విషయం ఆలోచించలేదు తన తండ్రి తెచ్చే జీతానికి తన జీతం ఇస్తే గాని ఇల్లు గడవదు. పక్షవాతంతో లేవలేని తల్లితో.

"అంగీకరిస్తారు గిరీ! కానీ ఒక్క షరతుమీద. నా జీతం మాత్రం ఇంటికి ఇవ్వాలి" అంది

"అలాగే తప్పకుండా! జీతంకోసం కాదుకదా నేను నిన్ను పెళ్ళి చేసుకునేది." అన్నాడు దగ్గరకు తీసుకుంటూ

అప్పుడే దూరంగావున్న కోటేశ్వరుని కోవెల్లో గంటలు మ్రోగాయి

* * *

తలుపు చప్పుడుతో గిరి ఆలోచనల వలయం తెగిపోయింది. వాచీ చూసు

కున్నాడు. అరుంపావు అయ్యింది. గిరికి అరుణమీద కోపం వచ్చింది. రావటం ఇంత ఆలస్యమా? లోపలకు రాగానే దగ్గరకు తీసుకుంటూ శిక్ష వెయ్యాలి అనుకుంటూ తలుపు తీశాడు.

ఎదురుగా ఏభై ఏళ్ళు పై బడ్డ ముసలాయన. ఆశ్చర్యపోయాడు గిరి.

"ఎవరు కావాలండీ?" అన్నాడు ఆశ్చర్యంనుండి తెప్పరిల్లుకుంటూ.

"మీరేనా గిరిగారు?" అందా ముసలి కంఠం

"అవును. లోపలికి రండి" అన్నాడు.

"నేను నీ కోసరమే వచ్చాను నాయనా!" అన్నాడు సోఫాలో కూర్చుంటూ.

గిరి తలుపుమూసి లోపలకు వచ్చాడు.

"చెప్పండి" అన్నాడు గిరి అసహనంగా ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంటూ. తొందరగా రానందుకు అరుణను తిట్టుకుంటూ.

మళ్ళా తలుపు చప్పుడయ్యింది అరుణ వచ్చేసింది. ఈ ముసలాయన్ని ఎలా సాగనంపటం భగవంతుడా అనుకుంటూనే తలుపు తీశాడు. అరుణ రాలేదు. ఆమె చిన్నచెల్లి వచ్చింది.చేతిలో చీటీ పెట్టింది.

"మా అమ్మకు బాగులేదు, సినీమాకు రాలేనందుకు క్షమించండి-అరుణ" అన్న చీటీని జేబులో పెట్టుకుని తలుపేసి వచ్చాడు.

"నీ కేమయినా అర్జంటు పనులున్నాయా నాయనా?" అడిగాడు ముసలాయన.

"లేవండి" అన్నాడు పైపూడదీసుకుంటూ.

"నీ కథలు చదువుతుంటాను బాబూ! చాలా బాగుంటాయి. వాస్తవికతను మానవత్వంతో నిశితంగా పరిశీలించి రాస్తావు" అన్నారు జగన్నాధం

"ఏముంది లెండి కుర్రవాళ్ళం. ఊసుపోక రాసుకుంటున్నాం. వాస్తవానికి మీ కాలంలో వుండే కథానికా సాహిత్యానికి ముందు మేమెంతలెండి" అన్నాడు.

"అలాగనకు నాయనా సాహిత్యంమీద మారుతున్న సమాజంలో విలువలు, కాలమాన పరిస్థితులు దాడిచేస్తాయి. దాన్ని బట్టే రచనాధోరణి గూడా మారుతుంది" అన్నారాయన.

"నిజమేనంటీ" అన్నాడు గిరి ఆయన సాహిత్య విమర్శకు ముగ్ధుడవుతూ

"నేనొక పనిమీద వచ్చాను బాబూ! రచయితగా నీవు సమస్యాపరిష్కారం చేసి కథ రాస్తావా?" అన్నాడు జగన్నాధం కథ అనగానే గిరికి ఎనలేని ఉత్సాహం వచ్చింది. క్రొత్తతరానికీ పాత తరానికీ సంబంధించిన సమస్యలా అనిపించింది ఆయనకు

"చెప్పండి" అన్నాడు గిరి స్టవ్ వెలిగించి, టీ నీళ్ళు పడేసి కూర్చుంటూ

"సమస్య ఎవరిమీదుగానో చెప్పటం కన్నా నా పరంగానే ప్రారంభిస్తాను బాబూ" అన్నారాయన.

"నేను దిగవ వర్గానికి చెందినవాణ్ణి బాబూ! మా తండ్రి తాతలు జమీందారీ ఛాయాలో బ్రతికినవారు. నా దగ్గరకు వచ్చేసరికి అన్నీ సర్వ నాశనమై పోయాయి. మా కులంలోనే అమ్మాయిని

పెండ్లి చేసుకుని, రైస్ మిల్లులో ఫోర్ మేన్ పని చేస్తూ మొన్నటివరకూ కాలం నెట్టుకొచ్చాను. చూపానదని పని తీసే శారు మొన్ననే. మా పెద్దమ్మాయి ఉద్యోగంచేస్తూ మూడొందలు సంపాది స్తోంది. దానితో కలిపితే నా గుండెలమీద ఆరు కుంపట్లు వున్నాయి. ఆ తర్వాత వాడు ఊహాలు తెలియని పసిపిల్లవాడు తోనేకాక వాళ్ళమ్మ ప్రతీ రెండేపి రోజు లకు విపరీతమైన గుండెనెప్పితో బాధ పడిపోతూ వుంటుంది" అని దగ్గారు జగ న్నాథం. కొన్ని క్షణాల్లో అది విపరీతంగా మారిపోయింది.

గదిలోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు గిరి.

"రైసుమిల్లు గుమస్తా ఉద్యోగంలో డబ్బు సంపాదించలేకపోయినా ఆఖరికి ఈ దగ్గు సంపాదించాను బాబూ! అయితే మా పెద్దమ్మాయి ఒక అబ్బాయిని ప్రేమిం చింది. పెళ్ళిచేసుకుంటానని కూర్చుంది."

"దానికేమంత భాగ్యం పెండ్లి చేసే యండి. మీ తరంవాళ్ళు యీ తరాన్ని ప్రోత్సహించకపోతే ఎలాగ?"

జగన్నాథంగారు చిరునవ్వు నవ్వారు.

"కానీ అతను మా కులం కాదు బాబూ!"

"అయితే మీకన్నా తక్కువ కులమా?"

"కాదు బాబూ! అతను అగ్రవర్ణానికి చెందినవాడు."

"అయితే అతనేం మోసకాడా? దుర భ్యాసాలేమైనా వున్నాయా?"

"ఏంలేదు బాబూ! ఆయన ఉన్నత మైనవాడు. మంచి సంస్కారవంతుడని

ఓ ప్రేమకథ



చెప్పింది" అన్నారు నుదుటను పట్టిన చెమటను తుడుచుకుంటూ.

"అబ్బాయి తలిదండ్రులు ఎవరైనా ఆ వివాహానికి పేచీ పెట్టారా?"

"లేదు."

"అయితే కట్నాలదగ్గర పేచీ వచ్చిందా?"

"కాదు బాబూ! అతను కట్నం తీసు కుని పెండ్లి చేసుకోవలసినంత నీచహృద యుడు కాదు. వాస్తవానికి పెండ్లి చేసుకున్న తరువాత జీతం గూడా ఇంటికి ఇమ్మ న్నంత విశాలహృదయుడు" అన్నారు.

గిరి ఒక్కసారి ఆశ్చర్యపోయాడు.

"అయితే మరేమండీ! మీరు ఎలాగ పెండ్లి చేయలేరు. మంచివరుడంటు న్నారు. వారుభయులు ప్రేమించు కున్నారు. మీరు రెండక్షతలు వేసి, వారిని ఆశీర్వదించండి" అన్నాడు గిరి.

"అక్కడే నాకూ మా అమ్మాయికీ పేచీ వచ్చింది బాబూ!"

"ఎందుకండీ! మీలాంటి పెద్దలు, అనుభవజ్ఞులు మారుతున్న కాలాన్ని

గుర్తించి ముందుకు పోవాలిగానీ "

"ముందుకు పోయి ఆలోచిస్తున్నాం బాబూ! వెనకతరంవాళ్ళం సమాజం మారుతోందని భ్రమలో వున్నాం. వర్ణ వర్గ వ్యవస్థ మారలేదు."

"ఎలా మారుతుంది? మీరందరూ కలిపి మారనివ్వటంలేదు. ఉన్న మార్పయినా నూటికి ఒకటో రెండో వంతులు వుంది."

"నిజమే బాబూ! అక్కడే వుంది నా సమస్య. దాని పరిష్కారం ఆలోచించి కథగా రాయి. వాస్తవానికి నేను నా కూతురి పెండ్లి చేయలేని అశక్తుడ్ని, ఆమె పెండ్లి చేసుకుంటే ఆశీర్వదించలేని అశక్తుడ్ని. ఇది జరిగితే నా ఇల్లు సర్వస్వం నాశనమైపోతుంది. ఎవరి జాతి వాళ్ళకి గొప్పది. ఎవరి కట్టుబాట్లు వాళ్ళ కున్నాయ్ అది కులంకాని కుర్రవాణ్ణి చేసుకుంటే దాని తల్లి గుండెలమీద కుంపట్లులా పెరుగుతున్న అయిదుగురు ఆడపిల్లల్ని వెలివేస్తారు. వాళ్ళకి పెళ్ళిళ్ళు జరగవు. నా జాతిలో చెయ్యగలనా? వాళ్ళకి సంబంధాలు వస్తాయా? ఏమయినా కానీ ఇప్పటివరకూ దాని జీతంమీద ఆధారపడుతూవుంది మా కుటుంబం? జీతం ఇంటికి పంపిస్తానంటుంది గానీ కొంతకాలం తరువాత మానేస్తే? ఇలాగ ఎన్నో సమస్యల మంటలమధ్య కాలిపోతున్నాను. నిస్సహాయంగా నేనే నీవుగా ఆలోచించి పరిష్కార మార్గం ఎలా చేస్తే బాగుంటుందో ఆలోచించు బాబూ!" అన్నారాయన.

స్టవ్‌లో నీళ్ళు వేడిగా మరుగుతున్నాయి, హోరుమని శబ్దం చేస్తూ. గిరి రెండు టీ కలుపుకుని వచ్చాడు వారిద్దరూ టీ త్రాగినంతసేపూ ఏమీ మాట్లాడుకోలేదు. ఎంతాలోచించినా పరిష్కార మార్గం దొరకలేదు.

"చూడండి జగన్నాధంగారు!ఇందులో రెండు సమస్యలు వున్నాయి. ఒకటి మానవత్వానికి, మమతకు సంబంధించినది. రెండోది స్వార్థానికీ, సంస్కారానికీ సంబంధించిన సమస్య."

"అవును బాబూ! ఎవరిజీవిత స్వార్థం ఇతరుల్ని నాశనం చేయగూడదు. సంస్కారవంతుడిగా నీవా సమస్యను..."

అర్థమయ్యింది గిరికి.

"నేనయితే ఆ అమ్మాయిని పెళ్ళాడి, ఆ కుటుంబ సర్వనాశనానికి ఆ కుర్రాడు దోహదమయ్యేటట్లుగా చిత్రించలేను."

"మరి సంస్కారమో?"

"సంస్కారానికైనా సరిహద్దు వుంది, చెలియల కట్టలా?"

"ఇదే నీ నిజ జీవితంలో సంభవిస్తే బాబూ?" అన్నాడు ఆర్ద్రంగా

గిరి నిరుత్తరుడయ్యాడు. కాసేపాగి, "అయితే మీరు మీరు !!!"

"అవును బాబూ! నేను అరుణ తండ్రిని."

* * *

అరుణకు పోస్టుమాన్ వచ్చి ఒక కవరందించాడు. ఆదుర్దాగా చించింది.

"అరుణా!

ఎంతో ఆలోచించి నా నిర్ణయం మార్చుకున్నాను. కారణం అడగకు. మన పెళ్ళి జరుగదు గిరి దాటని సంస్కారం మానవత్వం ముందు లొంగిపోయింది.

ఇట్లు
గిరి

ఇంట్లో తనకూ, తండ్రికీ జరిగిన సంఘర్షణ జ్ఞాపకం వచ్చిందామెకు. వేడి కన్నీటి చుక్కలు గిరి సంతకంమీద పడి చెరిపేశాయి. ***